క్లుప్తంగా

ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు



కార్యక్రమంలో పాల్గొన్న సుభాషిణి తదితరులు

సీటీఆర్‌ఐ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగు శాతం పెరిగేలా తీసుకుంటున్న చర్యలలో భాగంగా వృద్ధులు, దివ్యాంగులతో సమావేశాలు నిర్వహించినట్టు స్వీప్ నోడల్ అధికారి, సర్వ శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్ట్ సమన్వయకర్త ఎస్.సుభాషిణి అన్నారు. బుధవారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో వృద్ధులతో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతితో సమావేశం నిర్వహించి, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 85 సంవత్సరాల పైబడిన వృద్ధులకు, వికలాంగులకు వారూ నివాసం ఉండే చోట ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్నీ ఎన్నికల సంఘం కల్పించడంపై అవగాహన కల్పించామన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి


దుళ్లలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్ తదితరులు

కడియం: ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ కోరారు. దుళ్ల గ్రామంలో బుధవారం ప్రత్యేక భద్రతాదళం సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ తులసీదర్ మాట్లాడుతూ అకారణంగా గొడవలు పడడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కవాతులో కడియం పోలీసు సిబ్బంది, ప్రత్యేక భద్రతాదళం సిబ్బంది పాల్గొన్నారు.

పలకరించిన అకాల వర్షం

కడియం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం అకాల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మబ్బులతో మూసివేసి, మధ్యాహ్నం నుంచి చినుకులు మొదలై మోస్తరు వర్షంగా మారింది. ఎండల పెరుగుతున్న క్రమంలో వర్షం కురువడంతో ప్రజలు ఉపశమనం పొందారు. దోమ తీవ్రత పెరగకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని, నిర్దేశించిన పురుగు మందులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి కే.ద్వారకాదేవి కోరారు. ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల వరి పంటకు ఎటువంటి నష్టమూ ఉండదన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులు పరిశోధన పరిజ్ఞానం పెంచుకునే విధంగా బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌కు క్షేత్ర పర్యటనకు బయలుదేరినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు బుధవారం తెలిపారు. కళాశాలలోని 70 మంది విద్యార్థులు ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ పర్యటనలో పాల్గొంటారన్నారు. దేశంలోనే అత్యున్నతమైన పరిశోధనా కేంద్రానికి విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లడం చాలా గర్వకారణమన్నారు. ఈ పర్యటన వారికి విజ్ఞాన, వైజ్ఞానిక విషయాలను తెలుసుకోవడానికి సహకరిస్తాయన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డి.శ్రీనివాస్, రసాయన శాస్త్ర విభాగం నుంచి జాకబ్, శ్రీధర్, సురేష్, మల్లికార్జున, త్రినాధ్, సురేఖ, శాంతకుమారి, భార్గవి, శ్రావణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లాలమ్మను దర్శించుకున్న గోరంట్ల

కడియం: కడియపులంకలోని పల్లాలమ్మ వారిని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా జరిగిన రాట ముహూర్తంలో పాల్గొని, కొబ్బరికాయలు కొట్టారు. ఆయన టీడీపీ నాయకులు ఉన్నారు. అంతకు ముందు జనసేన నాయకులు, మాజీ ఎంపీటీసీ గెద్దం శివను ఆయన పరామర్శించారు

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కడియం: దుళ్ల గ్రామంలో వేర్వేరు ప్రదేశాల్లో సారా విక్రయిస్తున్న వేములూరు వెంకట్రావు, కల్లెం కాంతారావులను అరెస్టు చేసి, వారి నుంచి 10 లీటర్ల చొప్పున సారాను స్వాధీనం చేసుకున్నట్టు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చామన్నారు. తమ ఎస్‌ఐలు బీఎన్ దుర్గాప్రసాద్, టి.కృష్ణసాయి, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు.

కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో వెలంపేట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ మిక్కిలి దుర్గయ్యశాస్త్రి, మహంకాళి వెంకటరమా శాస్త్రిల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

మోరంపూడి జంక్షన్‌లో ట్రాఫిక్ డైవర్షన్


మోరంపూడి జంక్షన్‌లో జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు

- ముమ్మరంగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు
- 15 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీని కోసం రాజమహేంద్రవరం నగర, పరిసర ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. మోరంపూడి జంక్షన్ నుంచి నామవరం వెళ్లే రోడ్డులో ముఖ్యమైన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు 15 రోజుల పాటు జరగనున్నాయని, అటుగా రాకపోకలు సాగించే వాహనాలకు కొన్ని ట్రాఫిక్ డైవర్షన్ ఆంక్షలు విధించామన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్లో ప్రయాణించకూడదని, డివైడర్ల సందుల్లోంచి నుంచి రోడ్డు దాటడం ప్రమాదకరమని, తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ నియమాలు పాటించి తమ గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్‌ను రాజమహేంద్రవరం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు గమనించి, సహకరించాలని ఎస్పీ కోరారు.


మోరంపూడి ఎఫ్‌ఓబీ గడ్డర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఎఫ్‌ఓబీ పనులను పరిశీలించిన ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో అత్యంత ప్రధాన ఘట్టం కుడి, ఎడమల వంతెనలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసే గడ్డర్లను బుధవారం రాత్రి అమర్చారు. భారీ వాహనాలపై గడ్డర్లను బ్రిడ్జి నిర్మాణ స్థలానికి తీసుకొచ్చి క్రేన్ల సహాయంతో వాటిని అమర్చారు. ఈ పనులను ఎంపీ భరత్‌రామ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. విశాఖ, విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూశారు.

డైవర్షన్ ఇలా...

- నామవరం నుంచి మోరంపూడి సెంటర్ మీదుగా రాజమహేంద్రవరం టౌన్ లోనికి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు సాయినగర్ దుర్గమ్మ టెంపుల్ వద్ద కుడి పక్కకు తిరిగి గాదాలమ్మ రోడ్డు మీదుగా అప్సర హోటల్ వద్ద నేషనల్ హైవేకి వెళ్లాలి.
- సాయినగర్ దుర్గమ్మ టెంపుల్‌కి ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా, గంగిరెడ్ల కాలనీ మీదుగా హుకుంపేట సెంటర్‌కు వెళ్లాలి
- నామవరం నుంచి వచ్చే భారీ వాహనాలు సాయినగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రోడ్డులో గాదాలమ్మ రోడ్డు మీదుగా నేషనల్ హైవే కి వెళ్లాలి.
- ఆర్టీసీ బస్టాండ్ నుంచి నామవరం వెళ్లాల్సి వాహనాలు వీఎల్ పురం వినాయకుని గుడి మీదుగా రైతు బజార్ సెంటర్, కవలగొయ్యి సెంటర్, నేషనల్ హైవే మీదుగా, నిమ్మకాయల మార్కెట్ రోడ్డు (గాదాలమ్మ గుడి రోడ్) మీదుగా నామవరం వెళ్లాలి.

ముఖ్య గమనిక: నేషనల్ హైవే మీద విశాఖపట్నం నుంచి విజయవాడ, విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు ప్రయాణించే వాహనాలకు ఎటువంటి ఆంక్షలు లేవు.

అభివృద్ధికే మా మద్దతు


పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎంపీ భరత్‌రామ్

33వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు మద్దతిచ్చేందుకు తామంతా సిద్ధమ, ఈ మేరకు వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు స్థానిక 33వ డివిజన్‌కు చెందిన పలువురు ప్రకటించారు. బుధవారం లక్ష్మీవారపుపేట కోదండ రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎంపీ భరత్ రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరత్‌రామ్ నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ఒక వైపు రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ, మరోవైపు నగరాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. విజన్ ఉన్న చురుకైన నేతగా ఎంపీ భరత్‌రామ్ ప్రజలకు చేరువచ్చారన్నారు. గతంలో ఏ పార్టీలో ఉన్నా ఇప్పుడు మాత్రం వైఎస్సార్ సీపీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో మునాపు రమేష్, కాళ్ల శివకుమార్, సీహెచ్ ప్రసాద్, పి.సోమశేఖర్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, డబ్ల్యా రమేష్, డబ్ల్యా రాధాకృష్ణ, ఎం వెంకటేశ్వర రావు, మేడిశెట్టి రాము, దంగేటి శ్రీను, అర్జున్, వై కిశోర్, ఏ వీర్రాజు, మాదిరెడ్డి జగ్గయ్య, ఓగిరెడ్డి చిన్న, తదితరులు ఉన్నారు.

కల్యాణం.. కమనీయం


కడియంలో జనార్దన స్వామి రథోత్సవం


దుళ్లలో మదన గోపాలస్వామివారి కల్యాణం

- వైభవంగా స్వామివార్ల వార్షిక కల్యాణోత్సవాలు
- కడియంలో కనుల పండువగా రథోత్సవం

కడియం: మండల కేంద్రమైన కడియంలో జనార్దన స్వామివారు, దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామివారి కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా జరిగాయి. కడియంలో వేదాదంతం చక్రపాణి, దుళ్ళలో ఖండవల్లి రాదాకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు స్వామివారి కల్యాణ తంతును నిర్వహించారు. ముందుగా కడియంలో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి రథం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. రథాన్ని లాగేందుకు యువత ఉత్సాహం చూపించారు వైఎస్సార్‌సీపీ నాయకులు గిరజాల వీర్రాజు స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. అలాగే దుళ్ళలో శ్రీ మదన గోపాల స్వామివారికి శేషవాహనోత్సవం జరిగింది. రాత్రి స్వామి కల్యాణం నిర్వహించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో బుధవారం ప్రపంచ ఓరల్ హెల్త్‌డే కార్యక్రమంను డీఎం అండ్‌హెచ్‌వో డా.కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ×ముఖంపై ఆదర్శాలు–ఆరోగ్యకర చికిత్సా విధానాలు¥ అనే నినాదంతో నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ముఖం ఆరోగ్యానికి సంబంధించిన విశేషాలు, అందరికీ ఆరోగ్యకర ప్రవర్తన విధానాలను వివరించారు. నోటి క్యాన్సర్‌కు కారణం అవుతున్న పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నోటినీ శుభ్రపరచుకోవాలని దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఎపిడమాలజిస్ట్ సుధీర్, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈవో జాన్సన్ రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

అన్నపూర్ణయ్య సేవలు చిరస్మరణీయం


నరసింహారెడ్డిని సత్కరిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్‌ఐ: దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం జైలు జీవితం గడిపి, తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించిన మహనీయుడు మద్దూరి అన్నపూర్ణయ్య చిరస్మరణీయుడని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఆంధ్ర నేతాజీ మద్దూరి అన్నపూర్ణయ్య 125వ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక జెండా పంజా రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సభలో 2024 సంవత్సరానికి మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డులను పలువురుకి అందజేశారు డీఎంహెచ్ హైస్కూల్ విశ్రాంత హెడ్‌మాస్టర్ ఆర్‌వీ చలపతి, ఆధ్యాత్మిక, సామాజిక సేవవేత్త అంబటి భీమాశంకర నారాయణ, కార్మిక నాయకుడు కెల్.నరసింహారెడ్డి తదితర ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్‌జైన్, షేక్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నయనానందం.. నరసన్న కల్యాణం


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీనరిసంహస్వామి కల్యాణోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేవారు. తొలుత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించి అనంతరం మధ్యాహ్నం 1.58 గంటలకు అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణతో రథం బయలుదేరింది. కొండ దగ్గర నుంచి ప్రారంభమైన రథం దేవస్థానం రోడ్డు, సుజలా ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, రెడ్డిపంతులు సత్రం, శివాలయం మీదుగా సాగింది. ఈసందర్భంగా గరగ నృత్యం, బ్యాండ్ మేళం, కోలాటం, తీన్‌మార్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా జరిగింది. రాత్రి 9 గంటలకు వేదపండితులు నరసింహస్వామి, లక్ష్మీదేవిల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించారు. వేడుకలకు వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, డీసీ రమేష్‌బాబు, ట్రస్టీ తాడి రజనీ, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, బొండాడ చందు, కటకం బాబ్జి, బొరుసు బద్రి, వాకా నరసింహారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, నార్త్‌జోన్ డీఎస్పీ కె. శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరి మన్ననలు అందుకోవడం కొందరికే సాధ్యం

రాజానగరం: ఉద్యోగి అయిన ప్రతి ఒక్కరికి పదవీ విరమణ తప్పదని, అయితే కుమార్ మాస్టారు మాదిరిగా అందరి మన్ననలు అందుకుంటూ విరమణ పొందడం కొందరికే సాధ్యమని రిటైర్డ్ ఎంఈఓ లాజపతిరాయ్ అన్నారు. కోరుకొండలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఎంపీవీఎస్ ప్రభాకరకుమార్‌ని సుదీర్ఘకాలం పని చేసిన మండలంలోని శ్రీరామపురంలో ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, ఎస్టీయూ ప్రతినిధులు, బంధువులు, మిత్రులు కూడా కుమార్ మాస్టార్ దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించి, అభిమానాన్ని చాటుకున్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి



మనుషుల అక్రమ రవాణాకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శిస్తున్న సభ్యులు

రాజానగరం: మనుషుల అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దీనిని సకాలంలో సరైన రీతిలో అరికట్టకపోతే ఉన్మాదంగా పెరిగిపోతుందని మండల విద్యాశాఖాధికారి రామన్నదొర ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కి చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాను అరికట్టడంపై స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు బుధవారం ఒక రోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా రామన్నదొర మాట్లాడుతూ ముఖ్యంగా అమ్మాయిలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్నేహాలు, ప్రేమలు పేరుతో మోసాగాళ్ల మాయలోపడి జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ పరిచాయాలతో పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్నారని, మహిళలు తమను తాము రక్షించుకునే స్థాయిలో ఉండాలన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కె.బలరామకృష్ణ, పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ మాట్లాడుతూ మహిళ శిశు సంక్షేమ శాఖ, పోలీసు, విద్యా శాఖ, న్యాయ శాఖల సహకారంతో ఇంత వరకు 28,200 మంది అమ్మాయిలను అక్రమ రవాణా నుంచి కాపాడి, పునరావాసం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మి, ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్యశృతికుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, సుప్రియ, సీసీలు రాజయ్యదొర, లవకుమారి, జి. నాగరాజు, ఎస్. పద్మారావు, పి.కన్నబాబు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

సంహితలో మెగా జాబ్ మేళా


జాబ్ మేళాలో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక తాడితోట జంక్షన్ వద్ద ఉన్న సంహిత డిగ్రీ కళాశాలలో బుధవారం హెచ్‌ఆర్ అండ్ కో, డీవీపీ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ బహుళ జాతి కంపనీ సదర్‌ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్, టాటా ఎలక్ట్రానిక్స్, టెక్నో టాస్క్‌తో పాటు 13 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. దీనికి 300 మంది విద్యార్థులు హాజరు కాగా 190 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి వార్షిక ఆదాయం 2.4 నుంచి 3.6 లక్షల వరకూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ శ్రీధర్, కంపెని హెచ్‌ఆర్ శ్రీప్రవర్థినీ, కళాశాల ఏవో జి.బాలకృష్ణ, కార్తిక్, శోభ, సురేష్, నవీన్, సింధూ, తనూజ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దు


సీతారామపురం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా దంపతులు

రాజానగరం: అధికారం కోసం ప్రతిపక్షాలు తమ పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని, వారి మాటలను నమ్మవద్దని, వాస్తవాలను గ్రహించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సాస్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను చూసి, పొందిన సంక్షేమ పథకాలను మరుకుండా రాబోయే ఎన్నికల్లో మరొకసారి వైఎస్సార్ సీపీ అవకాశం ఇవ్వాలని కోరారు. మే 13న జరుగబోయే ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో రాజానగరం మండలం, సీతారామపురం నుంచి ఎన్నికల ప్రచారాన్ని తన సతీమణి డాక్టర్ రాజశ్రీతో కలసి బుధవారం ప్రారంభించారు. తొలుత ఆ గ్రామంలోని రామాలయంలో జక్కంపూడి రాజా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. డాక్టర్ రాజశ్రీ మహిళలకు బొట్టు పెట్టి, రాబోయే ఎన్నికలలో 'ఫ్యాను' గుర్తుకు ఓటు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1158 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేపడితే, మరో రూ.1142 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించామన్నారు. వీటిలో సీతారామపురంలో రూ.11 కోట్ల మేరకు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేసేలా అందుకు అవసరమైన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, సీతారామపురం సర్పంచ్ బొబ్బరాడ వరహాలు, ఉపసర్పంచ్ గొల్లబ్బాయి, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, వేమగిరి కృష్ణ, అడబాల చినబాబు, అడబాల వీర్రాజు, పలివెల గోవిందు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	భీమా
సూర్యమినీ	:	బస్తర్,యోధా
సూర్యప్యాలెస్	:	కుంగ్‌ఫూపాండా–4
స్వామి	:	వెయ్‌దరువెయ్
శివజ్యోతి	:	హనుమాన్
అనుశ్రీ	:	ప్రేమలు
రాజా	:	రజాకార్
ఊర్వశి	:	రజాకార్
రంభ	:	తంత్ర
మేనక	:	లంబసింగి, షరతులువర్తిస్తాయి
అప్సర	:	గామి
కుమారి	:	మాయ,ప్రేమలు
నామవరం		
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	రజాకార్
మురళీకృష్ణ	:	ప్రేమలు